

# మాయదారి కడుపు

కొడవటిగంటి కుటుంబరావు

నిజానికి లక్ష్మి తొందర పడవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు. తల్లీ తండ్రీ పిల్లను తిరిగి వివాహం చేద్దామనే సంకల్పంతోనే ఉన్నారు. హృదయాలెట్లా ఉన్నవో ఎవరూ చూడలేరు కదా! పైకి చుట్టపక్కాలంతా తప్పక లక్ష్మికి పెళ్లి చెయ్యవలిసిందనే సెలవిచ్చారు. చక్కని చుక్కలాంటి పిల్ల, మొగుణ్ణి సుఖపెట్ట గల నేర్పరి, ఇంటిపనులు తనంతట చక్కపెట్టుకు పోగల యిల్లాలు కాదగ్గది, చదువుకున్నది, నిదానం కలది, తెలివిగలది, ప్రతిదానికి అడ్డంగా పుల్లల్లే పొడుచుకు రాదు - అన్ని విధాలా సంఘంలో స్థానం పొందదగిన మనిషి, అటువంటిది పెళ్లాడి పిల్లల్ని కనకపోతే యింకెవరు కంటారు?

సామాన్యంగా వితంతు వివాహాలకు తటపించే చిక్కు కూడా లేదిక్కడ; ఏ అపభ్రంశపు వివాహార్థుడు దాపరిస్తాడో అనికూడా భయంలేదు. కాశీ విశ్వవిద్యాలయంలో మైనింగ్ మెటలర్జీ మూడో సంవత్సరం చదువుతున్న భగవాన్లు తననోటిమీదుగా అడిగాడు లక్ష్మిని తన కిమ్మని. అతనూ చిన్నవాడు, పెద్ద చదువు చదవటం చేత కాస్త పటాటోపంగా కనిపిస్తాడు కాని చాలా సంసారపక్షం మనిషి, ఇప్పటి కాలపు చదువుకున్న వాళ్లల్లే మనుషులను ముళ్లమీద ఉన్నట్టు చేసేవాడు కాడు. సాధువు, ఎప్పటికైనా నూరునూటయాభై రూపాయల ఉద్యోగం అవలీలగా సంపాదించ గలవాడు. ఉన్న ఊళ్లో ఉద్యోగం దొరకదంటారా? ఉండి చేస్తున్న పంట్లు బావుకున్న దేమిటి?

నేనన్నట్టు ఇటువంటప్పుడు లక్ష్మి తొందరపడవలసిన విషయం ఏమీ లేదు. కాని లక్ష్మి తొందరపడటంలో అట్లా ఇట్లా కాకుండా బొక్కబోర్లా పడ్డది. ఏదైనా దాగుతుంది కాని దొంగతనమూ రంకుతనమూ దాగవు సుమండీ!



నరసయ్యా సోమమ్మగార్లు వంటింట్లో కాబినెట్టు మీటింగు పెట్టారు.

"ఇదెక్కడి ప్రారబ్ధమండీ!" అంది సోమమ్మ.

"ఇదేం కర్మమే!" అన్నాడు నరసయ్య.

"ఇదెక్కడ దాపరించిందండీ!"

"ఇదికూడా ఎక్కడ దాపరించిందే!"

ఈ విధంగా కాస్సేపు ఒకరొకరి కనుకరించుకున్నారు. ఉన్నసంగతేమిటో లోపల ఇద్దరికే దిగులుకన్న వివ

రాలు తెలుసుకోవాలనే యావ జాస్తిగా ఉంది. మెల్లిగా నరసయ్య బయటపడ్డాడు.

"అయితే నిజమేనంటా?"

"అయ్యో! మీరెంత అమాయకులండీ! ఆ పొట్ట కనిపించటంలేట్టండీ బీరకాయల్లే!"

"మరయితే వేవిళ్లూ అవీ—

"అవునూ! మొన్న మొన్నటివరకూ దాని డోకులూ, వాంతులూ ఏమిటండీ!"

"పైత్యవన్నాడే నంబాయన!—"

"నంబాయన బతుకూ సరే న్వా బతుకూ సరే!"

నరసయ్య కింకో ప్రశ్నకూడా వెయ్యాలని ఉంది. అసలదే ముఖ్యమైన విషయం. కాని అది వేసేస్తే తన భార్య ఎట్లా భావిస్తుందో?

"ఇంతకు—అదంతా అట్లా ఉంచి—మనలోమాట—కనుక్కోటం కష్టమేననుకో—"

సోమమ్మ మొగుడి ప్రశ్నను సగం వూహించి రాని వ్మన్నట్టు తల ఊపింది. నరసయ్యకూడా ఇక నిగ్రహించలేక "ఎవరై ఉంటారు?" అనేశాడు.

సోమమ్మ దివ్యమైన సినిమా యాక్షన్ చేసింది. మొదట అర్థంకానట్టు నటించింది. తరవాత తెల్లబోయింది. మళ్లీ వెంటనే అభిప్రాయం మార్చుకుని ఎర్రబోయింది. మళ్లీ మొగుడివంక చూసి తిరిగ్గా కళ్లనీళ్లు పెట్టింది. నరసయ్య కంగారుపడ్డాడు.

"ఎవరే? ఎవరే?" అన్నాడు మొగుడు. ఏదో కొంప లంటుకునే రహస్యమనుకున్నాడు పెళ్లాం కంగారుచూసి ఆ కంగారంతా ఏమిటంటే సోమమ్మకు అనుమానించేంమకు ఒక్క మొగముండాకొడుకు పేరు తట్టి ఏడవలేదు విశ్వప్రయత్నం చేసినా.

చివరకు మెల్లిగా "భగవాన్లు!" అంది. నరసయ్య ప్రాణం కుదటబడ్డది. ఒక దీర్ఘ నిశ్వాసం విసర్జించాడు.

భ-గ-వా-న్లే-క-దా! ఫరవాలేదు. ఎట్లాగో వాడికే అది రాసిపెట్టుండె. ఫరవాలేదు, మరేమీ ఫరవాలేదు. ...కాని ఒసే! ఎన్నో నెలంటావు? మూడా? వాడు వెళ్లినాక ఇది బయటుండెను గామసే! హోసి పిచ్చి ముండా! వాడీసారి వచ్చినప్పు డిక్కడ రొండురోజులే కానుకే ఉంది? నీ తెలివి తగలడ్డట్టే ఉంది!" ఒక్కసారి నరసయ్యకు పెళ్లాం తెలివి తేటలను గురించి కను విప్పయింది. ఈ పాడెగట్టతో పనికాను తనంతట తనే ఆరా తియ్యాలని తీర్మానించుకున్నాడు.

మర్నాడుదయం కూతురు ఏకాంతంగా దొరుకుతుం దేమోనని పిల్లతే ఇంటిచుట్టూ దొడ్డిచుట్టూ తారాడాడు. తల్లికి తెలీకుండా కూతురితో మాట్లాడాలి. అందుకూ అంత అవస. చివర కెట్లాగైతేనేం కూతుర్ని ఒంటరిగా అటకాయించి "ఎవడే, అమ్మాయి!" అని అడిగాడు.

లక్ష్మి తెల్ల మొహంవేసి "ఏమిటి ఎవడు?" అంది.

నరసయ్య చిన్న బుచ్చుకున్నాడు. తన్ను సమాధానం చెప్పటానికి వీల్లేని ప్రశ్నలు వెయ్యటంలో లక్ష్మి గట్టిది. ఇది ఎంతమాత్రము బాగాలేదు. కొంతమంది మాట్లాడటం చేతగానివాళ్లిటువంటి ప్రశ్నలే వేస్తారు. ఏమిటి ఎవడేమిటి, అసహ్యంగా! ఏమిటి ఎవడుట! ఏమిటి ఎవడు! ఆ ప్రశ్న చాలనట్టు "నీకేమైనా మతి చెడ్డదా ఏమిటి?" అని లక్ష్మి చక్కాపోయింది. నరసయ్య చేసిన భగీరథ ప్రయత్నం కాస్తా బుగ్గయింది. లక్ష్మి ఇట్లా లోపలికి వచ్చిందో లేదో తల్లి రహస్యంగా వంటింట్లోకి పిలిచి "ఎవడే అమ్మాయి" అంది......

వంటింట్లో కూతురు కేకవేస్తున్నది తన్ను గురించే నని దొడ్లోనించి నరసయ్య నిశ్చయపరుచుకున్నాడు. ఆయన కాళ్లు చల్లబడినై, "రామరామ ఈ ఆడవాళ్లుండే..."

"అమ్మాయి చెప్పటం లేదండీ! పైగా నన్ను కేక వేసింది. పాడుపని చేసి పైగా నోరు చేసుకుంటుంది కూడాగద! ఎక్కడి పాపకర్మమో! మరీ ఇంత కలియుగమా!"

"నువ్వేమన్నావేం?"

"ఎవరే అమ్మా అని బుజ్జగించి అడిగితే—ఇరుగూ పొరుగూ వినిపోతారని మెల్లిగా వంటింట్లోకి పిలిచి అడిగానండోవు!—ఆపళంగా అరవటం మొదలు పెట్టింది! ఇంత అసూయిత్య మ్మనిషిని నేనెక్కడా చూళ్లేదూ!"

"ఎప్పుడే?"

"పొద్దున్నేనండీ!"

నరసయ్య మనసు కుదటపడ్డగి. ఇటువంటి పను జరిగినప్పుడు పెద్ద ముండాకొడుకుల కింతకష్టం ఉందనే

శాస్త్రాల్లో ఇటువంటి పనులు నిషేధించారు. - తప్ప కుండా! ఈ పని పెళ్లాంవల్ల కాదని తేలిపోయింది— మరోసారి

"నన్ను చూడు!" అని నరసయ్య పెళ్లాం దగ్గిర్నించి కూతురున్న గదికి నిష్క్రమించాడు.

కాస్సేపటికి కావెపునించి పెద్ద ధ్వని వినపడ్డది. సశబ్దస్తములో భవత్. చెవులు రిక్కించి వింటున్న సోమమ్మ గుండె లవిసిపోయినై.

ఆ రాత్రి మళ్లీ వంటింటో కౌన్సిలాఫ్ వార్ జరిగింది.

"ఏం చేద్దాం?"

"అదే నేనూ అడగబోతున్నాను. ఏం చేద్దాం?"

"నిజమే ననుకోండి. ఏంచేద్దా మిప్పుడు?"

"కనకనే, నే నంటున్నది. ఏంచెయ్యా లిప్పుడు?"

"డాక్టర్ను పిలిచి—"

"ఆడ డాక్టర్ని—"

"అవును. రహస్యంగా—"

"నిజమే మరో పదిరూపాయలు జాస్తిగా చేతులో పెట్టి—"

"కడుపు కాస్తా—"

"తీయించేసేద్దాం!"

ఇద్దరి ముహాలూ చాటంతయినై.

ఊళ్లో ఒకతే లేడీ డాక్టరు.

నరసయ్య ఆమద్దంలో "దారి స్త్రీలకుమాత్రము" అన్న చెక్క చూడకుండా జొరబడ్డాడు. కాని లంఖిణి అడ్డపడనే పడ్డది.

"ఎవరండీ మీరు?" అన్నది లంఖిణి.

"నేనా?—నేను—" పైన నరసయ్యను మాట రాలేదు.

"ఇది ఆడవాళ్ల ఆసుపత్రి."

"అయితే నేనేమిటనుకున్నావు?" అన్నాడు నరసయ్య. అంటే ఆయన ఉద్దేశం ఆడదాని పనిమీదే వచ్చాననని.

"మీరు లోపలికి వెళ్లటానికి వీల్లేదు!" అంది లంఖిణి.



"అయితే ఎట్లా?" అన్నాడు నరసయ్య.

"మీ విజిటింగ్ కార్డున్నాండి?"

"అంటే?"

"చచ్చాను! మీపేరేమిటి?"

"నరసయ్య!"

"ఇంటిపేరు?"

చచ్చినా జ్ఞాపకం రాలేదు నరసయ్యకు. ఆ ఇంటిపేరే దైనా ఉంటే నరసయ్య అక్షణంలో దాన్ని పూర్తిగా మరిచిపోయినాడు.

లంఖిణి ఏదో సణుగుతూ నిష్క్రమించింది.

లేడీ డాక్టరు రహస్యంగా పని చెయ్యాలి కనక నూరు రూపాయలు ఫీజడిగి యాభై అడ్వాన్సు కోరింది. అంత డబ్బు తన దగ్గిర లేదన్నాడు. తన చికిత్స మాత్రం పెరట్లో కాస్తున్నదా ఏమిటని అడిగింది డాక్టరు. మొత్తం యాభైరూపాయలు. అంతా ముందే ఇచ్చేట్టు సిరమైంది. నరసయ్య చావు తప్పి కన్ను లొట్ట పోయినా డాక్టర్ను వెంట పెట్టుకు మరీవచ్చాడు.

డాక్టరు లోపలికి వెళ్లింది పిల్లను పరీక్ష చెయ్యటానికి. దంపతు లిద్దరూ పర్యవసానంకోసం నిరీక్షిస్తున్నారు.

ఒక అరగంట దాటిన తరవాత లేడీ డాక్టరు బయటికి వచ్చింది. లంఖిణి ఏదో మనిషిపేరే పెట్టి పిలిచింది. యాభై రూపాయలు ముట్టిన సంగతి తెలుసుకుంది. నరసయ్యవైపు తిరిగి "పిల్లకు కడుపులో గల్ల. పట్నం పంపించండి" అని వెళ్ళిపోయింది.

నరసయ్యా సోమమ్మా ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు. నరసయ్య పెళ్లాన్ని ఏదో ఫడేలున అందామన్నట్టు చూశాడు. కాని ఆయన నోటమాట రాలేదు. నేను మొదటనే చెప్పలా అన్నట్టు సోమమ్మ మొగుడి వంక చూచి కూతుర్ని ఓదార్చబోయింది.